క్లుప్తంగా

ప్రభుత్వ బడిలో ఎన్నికలు



ధర్పల్లి: మండల కేంద్రంలోని ధనంబాండ(డీబీ) తండా ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ లీడర్ కోసం బుధవారం ఎన్నికలు నిర్వహించారు. హెచ్ఎం వెంకట్ రాజారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేయడం, బ్యాలెట్ పేపర్‌తో ఓటింగ్ నిర్వహించారు. 3 నుంచి 7వ తరగతి విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొని, ఓటు వేశారు. గూగులోత్ మహేష్, గూగులోత్ విగ్నేష్ స్కూల్ లీడర్లుగా ఎన్నికయ్యారు. వారికి హెచ్ఎం నియామక పత్రాలను అందించారు. సర్పంచ్ నరేందర్, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీనివాస్, నాగరాజు, గంగాధర్, స్రవంతి పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే ఇప్పించాలి



నిజామాబాద్ సిటీ: తమకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులో ఉన్నామని, తక్షణమే వేతనాలు ఇప్పించాలని సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు వారు బుధవారం హైదరాబాద్‌లో ఎన్‌డీఎస్ఎల్(నిజాం డక్కన్ షుగర్ లిమిటెడ్ ఫ్యాక్టరీ) కమిటీ సభ్యుడు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మూతబడిన ఫ్యాక్టరీను తిరిగి తెరిపించాలని, రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది గోవర్ధన్‌గౌడ్, రహీమ్, మజర్, రాములు, రవీందర్, విజయ్ ఉన్నారు.

అనుమతిలేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఎలాంటి అనుమతులు లేకున్నా, ప్రచారం నిర్వహిస్తున్న ఆల్ఫోర్స్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఎన్ఎస్‌యూఐ నాయకులు బుధవారం ఇంటర్ విద్యాశాఖ అధికారి రఘురాజ్‌కు వినతిపత్రం అందించారు. అనుమతులు లేకుండా కళాశాలను ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్న సదరు కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు శివ, ధనుష్ పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..



నగరంలో నిబంధనలకు విరుద్ధంగా కమర్షియల్ భవనంలో కొనసాగుతున్న ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వారు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి రఘురాం, నవీన్, కృష్ణ, భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికను అడ్డుకోవడం సరికాదు

సుభాష్‌నగర్: తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికను అడ్డుకోవడం సరికాదని, ఇది ప్రజాస్వామికవాదుల గొంతు నొక్కడమేనని టీజేఎస్ నగర అధ్యక్షుడు దువ్వా వెంకట్ విమర్శించారు. నగరంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదండరాంకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవిని అడ్డుకునే విషయంలో మరోసారి పునరాలోచించాలని సూచించారు. నాయకులు మర్రి కిరణ్, మోసిన్, బలాల, సలీం, జావిద్, ఉల్లెంగ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ



ఇందల్వాయి: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో జరిగిన అండర్–14 ఇంటర్ సొసైటీ లీగ్ బాలికల వాలీబాల్ పోటీల్లో ఇందల్వాయి ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కోచ్ సుష్మ బుధవారం తెలిపారు. వారిని ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

జీతాలు సరే.. విధులెక్కడ?

- 'శానిటేషన్ ప్రత్యేక టీం'లకు పని కరువు
- ప్రతి నెలా వేతనాలు పొందుతున్న సుమారు 50మంది కార్మికులు



నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లోని శానిటేషన్ విభాగం అస్తవ్యస్తంగా మారుతోంది. ఈ విభాగానికి ఇన్‌చార్జి అధికారే ఉండడంతో కిందిస్థాయి సిబ్బంది ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇన్‌చార్జి అధికారి పరిధిలో ప్రత్యేకంగా రెండు స్పెషల్ టీంలు ఉన్నాయి. ఒక్కో టీంలో 20కిపైగా కార్మికులు ఉండగా, రెండు టీంలకు కలిపి సుమారు 50మంది ఉన్నారు. కానీ వీరు విధులు ఎక్కడ నిర్వహిస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. అయినా సరే ప్రతి నెలా సక్రమంగా జీతాలు మాత్రం ఇవ్వడంతో తోటి ఉద్యోగులే అక్రమాలు జరుగుతున్నాయని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఒక్కో స్పెషల్ టీంకు ఒక్కో జవాన్ ఇలా రెండు టీంలకు ఇద్దరు జవాన్‌లున్నారు. ఇన్‌చార్జి ఎంహెచ్‌వో ఆదేశాల మేరకు జవాన్‌లు ఆయా టీంలోని కార్మికులతో విధులు నిర్వహిస్తున్నామని చెబుతున్నారు.

అవసరం లేకున్నా..

శానిటేషన్ విభాగానికి అసలు ప్రత్యేక టీం అవసరం లేదు. ఎప్పుడైనా పెద్ద ఎత్తున వర్షాలు కురిసినప్పుడు ప్రజలకు ఇక్కట్లు ఏర్పడితే అత్యవసరంగా సిబ్బందిని ఏర్పాటు చేసి, చకచక పనులు చేస్తారు. ఏదైనా ఆపత్కాలం వచ్చినప్పుడు మాత్రమే ప్రత్యేక టీంలు పని చేయాల్సి ఉంటుంది. కానీ ప్రత్యేక టీంలో పనిచేస్తున్న కార్మికులు ఎప్పుడొస్తారో ఎప్పుడు వెళతారో కూడా తెలిదంటున్నారు. ప్రత్యేక టీంలో కార్మికులు వచ్చినా.. రాకున్నా ప్రతి నెల మాత్రం జీతాలు ఇస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. నగరంలోని ఆయా జోన్ పరిధిలో కార్మికులు విధులు నిర్వహిస్తేనే జీతాలు ఇస్తున్నారు. ప్రత్యేక టీంలో పని చేసే కార్మికులు మాత్రం ఎక్కడ పని చేస్తున్నారో కూడా చెప్పడానికి అధికారులు వెనుకడుగు వేయడం గమనార్హం. ఈవిషయమై ఇన్‌చార్జి ఎంహెచ్‌వో సాజిత్‌అలీని 'సాక్షి' వివరణ కోరగా.. ప్రత్యేక టీంలో కార్మికుల విషయాలు మేం చెప్పకూడదు. ఏదైనా ఉంటే కమిషనర్‌ను అడిగి తెలుసుకోండి అని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఇప్పటికే శానిటేషన్‌లో జరుగుతున్న డీజిల్ అక్రమాలకు చెక్ పెట్టడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన విషయం తెలిసిందే. ప్రత్యేక టీంలపై కూడా ఆయన దృష్టిపెడితే అక్రమాలు బయటకు వచ్చే అవకాశం లేకపోలేదు.

ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం







ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న ఘన్‌పూర్ వీడీసీ సభ్యులు.. శాస్త్రినగర్‌లో జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే.. న్యాల్‌కల్‌లో హెల్త్ సబ్‌సెంటర్..

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

మోపాల్(నిజామాబాద్‌రూరల్)/నిజామాబాద్ రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. మల్కాపూర్, గుడితండా, శాస్త్రీనగర్‌లో జీపీ భవనాలను, న్యాల్‌కల్ గ్రామంలో ఆరోగ్య సబ్‌సెంటర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అలాగే శ్రీనగర్‌లో మహిళ భవన్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, అందరి సంక్షేమం కోసం పని చేస్తుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. న్యాల్‌కల్‌లో మహిళా సంఘం భవనానికి రూ.10లక్షలు ఇస్తానని హామీనిచ్చారు. మల్కాపూర్ గ్రామంలో కొన్ని భూములు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని నిరుపేదలకు పంచుతామని హామీ ఇచ్చారు. అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచులు గంగాప్రసాద్, లక్ష్మీ రంగ్యా, ఉపసర్పంచ్ సతీష్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజనా, మెడికల్ ఆఫీసర్ ఆశిష్, రవిచంద్ర, ఎంపీటీసీ అనూ సంగ్యానాయక్, ఎంపీడీవో లింగం, నాయకులు ముప్ప గంగారెడ్డి, సంతోష్‌రెడ్డి, సాయిరెడ్డి, సూర్యారెడ్డి, మహేందర్, గంగాధర్, భోజరావు, ఉమ్మాజి నరేష్, కుమార్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, సతీష్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, షేక్ కనిస బేగం, దాసరి శ్రీధర్, నాయకులు విఠల్‌రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి..

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్ వీడీసీ సభ్యులు, ఎంపీటీసీ కుర్రి సవిత రామకృష్ణ, సీనియర్ నాయకులు డాక్టర్ షాదుల్లా బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి సన్మానించారు. గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు లింబాద్రి, రాంచందర్, రాజేందర్, జగదీష్, సాయిలు, ఆకుల గంగాధర్, గణేష్‌రెడ్డి, తేజ, సాయిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ అభివృద్ధికి కృషి..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం ఆయన యూనివర్సిటీని సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను రిజిస్ట్రార్ యాదగిరి సత్కరించి, తెయూకు నిధులు మంజూరు చేయించాలని విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వంతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్‌ఆరతి, అడిషనల్ కంట్రోలర్ నందిని, పీఆర్‌వో ఏ.పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లె సర్పంచ్ గుర్రం నరేష్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు కర్సం మోహన్, సుధాకర్, ఆశిష్ తదితరులు ఉన్నారు.

జీపీ పాలకవర్గాలకు ఘనంగా వీడ్కోలు





డిచ్‌పల్లి మండల సర్పంచులతో ఎంపీపీ గద్దె భూమన్న.. దుబ్బాక గ్రామంలో..



సిరికొండ మండలకేంద్రంలో..

డిచ్‌పల్లి/సిరికొండ/ధర్పల్లి: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాల్లో బుధవారం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డిచ్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో 34 గ్రామాల సర్పంచులను, సభ్యులను ఎంపీపీ గద్దె భూమన్న సన్మానించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జీపీ పాలకవర్గ సభ్యులు ఐదు సంవత్సరాల పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండి చేసిన సేవలు అభినందనీయమన్నారు. వారితో కలిసి సహపంక్తి భోజనంచేశారు. సిరికొండ మండల కేంద్రంతో పాటు తూంపల్లి గ్రామంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామంలో సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ ప్రతాప్ గౌడ్, వార్డు మెంబర్లను కార్యదర్శి రాజ్ కుమార్, ఎంపీటీసీ పెండ గంగాధర్ సత్కరించారు. ఎంపీడీవో టీవీఎస్ గోపిబాబు, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ఏఈ శ్రీధర్, సర్పంచ్‌లు ఎన్నం రాజారెడ్డి, బాలమణిమల్లేష్, ఉపసర్పంచ్ బడాల రామకృష్ణ, నాగవ్వ, వార్డు సభ్యులు, వీడీసీ చైర్మన్ బడాల సంతోష్, శ్రీనివాస్, రాజేందర్‌గౌడ్, చింటు, శివారెడ్డి, మధు, లింగం, ప్రవీణ్, గంగారం, సురేష్, పంచాయతీ కార్యదర్శులు శివకుమార్, శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు లింగారెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రకాష్, రామస్వామిగౌడ్, మారుతి, గణేష్, కారోబార్ ప్రవీణ్ పాల్గొన్నారు.

యువతకు స్వామి వివేకానంద ఆదర్శం



మాట్లాడుతున్న కాపర్తి గురుచరణం

ఖలీల్‌వాడి: స్వామి వివేకానంద దేశభక్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలక్ కాపర్తి గురుచరణం అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బుధవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా న్యాయవాద పరిషత్ ఇందూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'యంగ్ అడ్వకేట్స్ మీట్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. నేటి యువత స్వామి వివేకానంద దేశభక్తిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణానంద్, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిదాస్ చందక్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు రాజుకుమార్ సుబేదార్, చింతకుంట సాయిరెడ్డి, మానిక్ రాజ్, నరేందర్‌రెడ్డి, బిట్ల రవి, ఉదయ్‌కృష్ణ వసంతరావు, రంజిత్ సుతారి, బాలాజీ, నారాయణ్ దాస్, చిన్నా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు నగరంలో విద్యుత్ అంతరాయం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని దుబ్బ సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్‌లో గురువారం మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏడీఈ టౌన్2 రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో నేడు ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. మహేశ్వరి భవన్, గాడ్స్ కాలనీ, గుమస్తా కాలనీ, దుబ్బా బైపాస్ రోడ్, దుబ్బ సబ్‌స్టేషన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేడు స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ పునః ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 1 నుంచి స్విమ్మింగ్ పూల్ అందరికి అందుబాటులో ఉంటుందని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 7గంటల వరకు ఈత కొలను అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



ఖలీల్‌వాడి: నగరంలో బుధవారం బీడీ యాజమాన్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులకు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బీడీ కార్మికులు కూడా పాల్గొంటారని తెలియజేశారు. సమ్మెను జయప్రదం చేయాలని బీడీ కార్మికులకు పిలుపునిచ్చారు. యూనియన్ ప్రతినిధులు నరేందర్, వెంకన్న పాల్గొన్నారు.


సంక్షిప్తం

పీఎంఎఫ్ఎంఈ లబ్ధిదారుల ఎంపిక




డిచ్‌పల్లి: మండలంలోని రాంపూర్, ధర్మారం గ్రామ సంఘాలకు చెందిన పలువురు సభ్యులు పీఎంఎఫ్ఎంఈ పథకానికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా బుధవారం రాంపూర్ సంఘానికి చెందిన నల్లవెల్లి సౌమ్య, భవాని మహిళా సంఘం నుంచి కట్టెగానుక మిషన్‌వ్యాపారాన్ని ఏర్పాటు చేయగా, డీఆర్‌డీవో చందర్‌నాయక్ ప్రారంభించారు. ధర్మారం గ్రామానికి చెందిన అనసూయ ఏర్పాటు చేసుకున్న ఫ్లోర్‌మిల్ మిషన్ సైతం ప్రారంభించారు. ఏపీఎం రజిత, సీసీ సురేష్, నాగరాజు, స్వప్న, ఎంఎస్‌ఏ అనిల్ పాల్గొన్నారు.


కిరణ్‌కుమార్ సంస్మరణ సభ



ధర్పల్లి: మండలంలోని రేకులపల్లి గ్రామంలో బుధవారం ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో పీవైఎల్ నాయకుడు వేములపల్లి కిరణ్ కుమార్ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పిట్ల కారల్ మార్క్స్, నాయకులు ఖాజా మొహినుద్దీన్, సాయికుమార్, జాకీర్, సాంబయ్య, శివరాజ్, రాములు, నర్సా గౌడ్, గంగారం పాల్గొన్నారు.

నూతన ఎమ్మెల్సీలకు సన్మానం





ఖలీల్‌వాడి/సుభాష్‌నగర్: తెలంగాణ శాసన మండలి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, బలమూరి వెంకట్ లను బుధవారం హైదరాబాద్‌లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విపుల్‌గౌడ్ సన్మానించారు. అలాగే టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ ఆధ్వర్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించారు. నాయకులు ఆకుల ప్రసాద్, జాఫర్ హుస్సేన్, దినేష్ బాబు, ఉమా కిరణ్ ఉన్నారు. అంతకుముందు మహేష్ కుమార్ గౌడ్ ప్రమాణస్వీకారంలో జిల్లా కాంగ్రెస్ నేతలు సుభాష్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలు



ఖలీల్‌వాడి: కిరణ్ కుమార్ వర్ధంతి సందర్భంగా బుధవారం నగరంలో ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెస్ పోటీలను న్యాయవాది గొంట్యాల రమేష్ ప్రారంభించారు. నాయకులు వనమాల సత్యం, వాసరి సాయినాథ్, సాయిరెడ్డి, జన్నారం రాజేశ్వర్, శివకుమార్, రాజు, గంగాధర్, భారతి, భూమయ్య పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ట్రస్మా నాయకులు



నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి ట్రస్మా నాయకులు కలిశారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి సమస్యల పరిష్కారాలు కోసం వారు సీఎంకు వినతిపత్రం సమర్పించారు. నాయకులు జయసింహాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం



ఖలీల్‌వాడి: ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్యాల గోవర్ధన్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్ రమేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ చారి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.

ఆగని గొడవలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులు, ఆరోగ్య శ్రీ డైట్ సప్లయిర్స్ (ఆరోగ్య శ్రీ రోగులకు ఫుడ్ డెలివరీ చేసే బాయ్స్)మధ్య వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా వారి మధ్య జరిగిన గొడవల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాత్రి సమయంలో దుర్భాషలాడుతూ గొడవకు దిగారు. వారం క్రితం కూడా వారి మధ్య ఘర్షణ జరిగిన విషయం విదితమే.ఈ ఘర్షణకు పాతకక్షలే కారణంగా తెలుస్తోంది.

చక్కెర ఫ్యాక్టరీలతో ఉపాధి



నిజామాబాద్‌నాగారం: మూసి ఉన్న చక్కెర ఫ్యాక్టరీలను నడిపిస్తే యువతకు ఉపాధి, రైతులకు మేలు కలుగుతుందని భారతీయ కిసాన్‌సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొండెల సాయిరెడ్డి తెలిపారు. మూసిఉన్న చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీలు వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించడానికి ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం ఫ్యాక్టరీలను నడపడానికి కృషిచేయడంతోపాటు మూడు జిల్లాల రైతాంగానికి లాభం చేకూరుతుందన్నారు. నాయకులు నారాయణరెడ్డి, సూర్యరెడ్డి, సాయరెడ్డి, భూమారెడ్డి, సాయినాథ్‌రెడ్డి, రాజన్న, పెంటాజీ ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేటలో విధులు నిర్వర్తించిన ఆయన బదిలీపై వచ్చారు. నవనాథ సిద్ధుల గుట్ట ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం శివాలయంలో రవికుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

ఈగ సంజీవరెడ్డికి సన్మానం



నిజామాబాద్‌నాగారం: ఇటీవల ఢిల్లీ జరిగిన ఆర్చరీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల్లో జిల్లా ఆర్చరీ అధ్యక్షుడె, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి ఉపాధ్యక్షులుగా విజయం సాధించారు. ఈసందర్భంగా బుధవారం నగరంలోని టీఎన్జీవోస్ భవనంలో ఆయనను సంఘ ప్రతినిధులు సన్మానించారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ.. అందరం కలిసి జిల్లా క్రీడాకారులకు చేయుతనిస్తూ జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోరాణించే విధంగా కృషిచేద్దామని అన్నారు. ఒలింపిక్ సంఘ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, కోశాధికారి భూమారెడ్డి, ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు విజయకాంత్, రాజగౌడ్, అబ్దుల్ ఒమార్, కార్యవర్గ సభ్యులు యాసిన్ మనోజ్ కుమార్, సురేష్, జావీద్, కబడ్డీ సంఘం కార్యదర్శి లింగన్న, సెపక్ తక్రా జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాధరి సంజీవ్ రెడ్డి, డేవిడ్, అబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	180
	(కిలోకు)	లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	45	60
బెండకాయ	60	80	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	50	80	దోసకాయ	20	40
దొండకాయ	45	60	ఆలుగడ్డ	15	30
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	60	80	గోబిపువ్వు	20	40
వంకాయ	25	50	బీట్‌రూట్	25	50
పాలకూర	10	20	కరివేపాకు	60	80
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	30	50	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,700	వెండి (కిలో)	76,500
22 క్యారెట్స్	59,662		

– నిజామాబాద్ బిజినెస్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కెప్టెన్ మిల్లర్(తెలుగు)-10.30 హనుమాన్(తెలుగు)- 1.20, 4.25,7.30, 10.30
స్క్రీన్-2	గుంటూరుకారం - 1.10, 7.30 ఫైటర్ (హిందీ)3డీ- 4.20, 10.40
స్క్రీన్-3	హనుమాన్(తెలుగు) -10.25, 7.40 కెప్టెన్ మిల్లర్(తెలుగు) - 1.30,

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఫైటర్ (హిందీ) -3డీ- 8.40, 12.15, 3.50, 7.25, 11.00
స్క్రీన్-2	హనుమాన్(హిందీ)-12.00,3.20, 6.40,10.00
స్క్రీన్-3	గుంటూరుకారం-3.40, 10.10 నా సామిరంగ(తెలుగు)-7.00
స్క్రీన్-4	అయలాన్(తెలుగు)-12.50,7.20 కెప్టెన్ మిల్లర్(తెలుగు)-4.10,10.40
దేవి	హనుమాన్(తెలుగు)
నటరాజ్	ఫైటర్(హిందీ)
లలితామహల్	గుంటూరు కారం(తెలుగు)
విజయ్	కెప్టెన్ మిల్లర్ (తెలుగు)